కేంద్రం జనగణనలో కులగణన చేపట్టాలి

మాట్లాడుతున్న జాతీయ బీసీ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ

కాచిగూడ, డిసెంబర్ 16 : బీసీల కోసం కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చి ఏండ్లు గడిచినప్పటికీ బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కులగణన చేయకపోతే కేంద్రంపై బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి కోలా జనార్దన్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నందగోపాల్, పి.సుధాకర్, ఉదయ్‌నేత పాల్గొన్నారు.

నానల్‌నగర్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజలకు ఆధార్ కార్డుల్లో సవరణలు, పేర్ల నమోదు కోసం నానల్‌నగర్ వార్డు కార్యాలయంలో సోమవారం ఆధార్ సేవల కేంద్రాన్ని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ ప్రారంభించారు. ఈ కేంద్రం వారం రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటుందని అన్నారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 16

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఉపాధ్యక్షుడిగా విష్ణుచారి

తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ఉపాధ్యక్షుడిగా రాళ్లబండి విష్ణుచారి నియమితులయ్యారు. సోమవారం బషీర్‌బాగ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ విష్ణుచారికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియామకానికి సహకరించిన సంఘం గౌరవాధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణామాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

– రవీంద్రభారతి, డిసెంబర్ 16

గోషామహల్‌లో ఉస్మానియా నిర్మిస్తే రణరంగమే..

ర్యాలీలో పాల్గొన్న గోషామహల్ పరిరక్షణ సమితి ప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు

- ఆస్పత్రి నిర్ణయాన్ని వెనక్కుతీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం
- వివిధ పార్టీల నాయకులు

అబిడ్స్, డిసెంబర్ 16 : రాష్ట్రంలోనే ధర్మాసుపత్రిగా పేరుగాంచిన ఉస్మానియా దవాఖానను గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ఉస్మానియాను మరో చోట నిర్మించాలని, జనావాసాలలో నిర్మించడం వలన ఇప్పటికే ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న తమకు మరింత సమస్య ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి స్థానికులు గోషామహల్ పరిరక్షణ సమితి పేరిట నిరసన కార్యక్రమాలను చేపడుతూ ఇంటింటా తిరిగి సంతకాల సేకరణ చేపడుతున్నారు.

పార్టీలకతీతంగా ఒక్కతాటిపైకి నాయకులు..

గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖానను నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఏకమయ్యారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే టి. రాజాసింగ్ పోలీస్ మైదానంలో ఉస్మానియా దవాఖాన ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. అదే విధంగా కార్పొరేటర్‌లు రాకేశ్ జైస్వాల్, లాల్‌సింగ్‌లతో పాటు నాయకులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి నిర్ణయాన్ని మార్చాలని వినతిపత్రం సమర్పించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎవరికి వారు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. పరిరక్షణ సమితి అధ్యక్షుడు వినోద్ యాదవ్ సమితి సభ్యుల సహకారంతో చొరవ తీసుకుని నిరసన కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నారు.

వివిధ పార్టీ నాయకుల భారీ ర్యాలీ..

ఉస్మానియా హాస్పిటల్ హఠావో గోషామహల్ గ్రౌండ్ బచావో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించగా స్థానికుల విజ్ఞప్తి మేరకు రాజకీయ పార్టీల కతీతంగా నాయకులు తరలి వచ్చారు. గోషామహల్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చాక్నావాడి నాలా ప్రాంతంలో గోషామహల్ ప్రజా గర్జన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి. పాండుయాదవ్, బేగంబజార్ కార్పొరేటర్ జి. శంకర్‌యాదవ్, జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, గోసామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, బీజేపీ నాయకులు ఓం ప్రకాశ్ భీష్వ, ఆల పురుషోత్తం, బంగారు సుధీర్‌కుమార్, రఘు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అశీష్‌కుమార్ యాదవ్, బెజిని శ్రీనివాస్, శాంతి దేవి, సురేశ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం మార్చుకునేంత వరకు ఆందోళన..

గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖానను నిర్మించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు ఆందోళనను ఉధృతం చేస్తామని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు.

నిరసన సభలో పాల్గొన్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్పొరేటర్‌లు

అయ్యప్ప పూజకు రావాలని కేటీఆర్‌కు ఆహ్వానం

ఈ నెల 18వ తేదీ బుధవారం సాయంత్రం నల్లకుంటలోని తన నివాసం వద్ద జరిగే శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి పడిపూజకు రావాలని కోరుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ సోమవారం కలిసి ఆహ్వానించారు. అలాగే తాను రూపొందించిన శ్రీమణికంఠ అయ్యప్ప స్వామి పూజా విధానం పుస్తకాన్ని కూడా కేటీఆర్‌కు అందజేశారు. – అంబర్‌పేట, డిసెంబర్ 16

బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్

మెహిదీపట్నం, డిసెంబర్ 16: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రజల కోసం చేసిన సంక్షేమ కార్యక్రమాలు ఏ ప్రభుత్వం చెయ్యలేదని నాంపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం నాంపల్లి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆనంద్‌కుమార్‌గౌడ్ నియోజకవర్గం సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలోనే పెను సంచలనం జరగబోతుందని, బీఆర్‌ఎస్ నాయకులకు,కార్యకర్తలకు అండగా ఉంటామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు సి.సంజయ్, మాజీద్, మురళీధర్, చెన్నబత్ని లక్ష్మీనారాయణ, ప్రదీప్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్స్ డే వేడుకలు

రవీంద్రభారతి, డిసెంబర్ 16 : పెన్షనర్స్ డే వేడుకలను ఈ నెల 17వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహిస్తున్నామని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ డి.ఎస్. నకార ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, సాంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి,ఎమ్మెల్సీ కోదండరామ్, హైకోర్టు అడ్వకేట్ బార్‌కౌన్సిల్ మెంబర్ విష్ణువర్ధన్‌రెడ్డి, గీఎన్‌జీవో జనరల్ సెక్రటరి ముజీబ్‌హుస్సేన్, ముత్యాల సత్యనారాయణగౌడ్, వెంకటేశ్ తదితరులు విచ్చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులతో కలిసి చైర్మన్ సాయికుమార్ భోజనం

సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మధ్యాహ్న భోజనం చేశారు. మిట్టపల్లి సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయంలో ఆయన భోజనం చేసి పౌష్టికాహారం, మెనూ అమలవుతున్న విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు మంచి మెనూ అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాయకులు పూజల హరికృష్ణ, గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. – అబిడ్స్, డిసెంబర్ 16

ఉస్మానియాలో పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు

దవాఖానలో రోగికి నిర్వహిస్తున్న ఈసీజీని పర్యవేక్షిస్తున్న ఆర్‌ఎంవో రఫీ పాషా

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 16 : ఉస్మానియా దవాఖానలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ అన్నారు. సోమవారం దవాఖానలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దవాఖానలోని క్యాజువాల్టీ, ఏఎంసీ, ఏఎన్‌ఎస్‌సీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, సర్జరీ, నెఫ్రాలజీ, యూరాలజీ తదితర కీలకమైన విభాగాల్లో మొత్తం 15 ఈసీజీ యంత్రాలు నిరంతరం రోగులకు ఈసీజీ రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. మరో మూడు బ్యాకప్ పరికరాలు అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. దవాఖానలో కేవలం ఒకే ఒక్క ఈసీజీ యంత్ర పరికరం పని చేస్తుండటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారంటూ ఓ పత్రిక(నమస్తే తెలంగాణ కాదు)లో వచ్చిన వార్తను ఆయన తీవ్ర స్థాయిలో ఖండించారు. పేదల ధర్మాసుపత్రిలో చికిత్సలు చేసేందుకు సూపర్ స్పెషాలిటీ విభాగాల్లోని నిపుణులైన వైద్యులు, స్టాఫ్ నర్సులు, సాంకేతిక సిబ్బంది, సుమారు రెండు వేల మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు నిరంతరం పేద రోగులకు వైద్య సేవలు అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ఉస్మానియా పేరు ప్రతిష్టలను అప్రతిష్టపాలుజేయకుండా రోగులకు మరింత మెరుగైనవైద్య సేవలను అందజేసేందుకు అవసరమైన అన్ని సూచనలు, సలహాలను అందజేయాలని ఆయన కోరారు.

వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

రవీంద్రభారతి, డిసెంబర్ 16 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చి 5 నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలేదని, తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేసి మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్నెం, సీనియర్ నాయకుడు కడమంచి సహదేవుడు, జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నరసింహ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణలో బేడ బుడగ జంగాలకు స్థానం కల్పించాలని చెప్పారు.

రచయితలకు భాషపై పట్టు అవసరం

రవీంద్రభారతి, డిసెంబర్16 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజావాసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజావాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన గ్రంథాల పరిచయ సభ రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నుడిగుడి , ఒక్క పదం అర్థాలెన్నో పుస్తకాల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ప్రముఖ సాహితీవేత్త నాళేశ్వరం శంకరం, డా.బిక్కి కృష్ణ, డా.బీరం సుందరరావు, డా.ఎకే ప్రభాకర్, తాడి ప్రకాశ్, ముదిగొండ సంతోష్, శాంతి నిర్మల హాజరై పుస్తకాలను సమీక్షించారు.

కుట్టు మిషన్ల.. పథకానికి దరఖాస్తులు

అబిడ్స్, డిసెంబర్ 16 : మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. నాంపల్లి లోని మైనార్టీ ఫైనాన్స్ కార్యాలయంలో ఇందిరమ్మ మహిళా శక్తి–కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని ఆయన కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ కాంతి వెస్లీతో కలిసి ప్రారంభించారు. మైనార్టీ మహిళలు (tgobmms. cgg. gov.in)లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సోమవారం నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నామని ఈ నెల 31వ తేదీ లోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

తైక్వాండో పోటీల్లో అంబర్‌పేట విద్యార్థుల సత్తా

గోల్నాక, డిసెంబర్ 16 : 3వ కేటీఏ కప్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో అంబర్‌పేట కవితా తైక్వాండో అకాడమీ విద్యార్థులు సత్తాచాటారు. శ్రీనివాసపురం కవితా తైక్వాండో అకాడమీలో సోమవారం నిర్వహించిన పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా అందులో పుమ్సీ, క్యొరిగి విభాగాల్లో కవితా తైక్వాండో అకాడమీకి చెందిన వంద మంది విద్యారులు పాల్గొని 200 గోల్డ్, 50 సిల్వర్, 50 కాంస్యం పథకాలు సాధించారు. ఈ సందర్భంగా పథకాలు సాధించిన విద్యార్థులకు గ్రాండ్ మాస్ట ర్ జయంత్ రెడ్డి, న్యాయవాది రామ్‌చరణ్, డాక్టర్ ప్రభాకర్, ఆర్యవైశ్య ఆలయం చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, అకాడమీ శిక్షకురాలు మాస్టర్ బి.కవిత, మేనేజర్ శ్రీకాంత్ తదితరులు విద్యార్థులను అభినందించి మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.

విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ

కార్వాన్‌లోని శ్రీ కేసరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్తయిద్ పురా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్వెటర్లు, బెడ్ షీట్లతో పాటు స్టేషనరీని ప్రతినిధులు కేశవ రావు, గోపాల్, బాలక్రిష్ణ, క్రిష్ణ, శ్రీశైలం, జనార్ధన్, యాదగిరి, సంతోష్ తదితరులు అందించారు. – కార్వాన్, డిసెంబర్16

కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారికి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో భాగంగా నిర్వహించిన రెజ్లింగ్ పోటీలలో నాంపల్లి నియోజకవర్గంలోని మల్లేపల్లి అన్వరులూం కాలేజీకి చెందిన వి ద్యార్థులు పతకాలను గెలిచారు.79 కేజీల విభాగంలో షేక్ ఉజైర్ బంగారు పతకం, అబ్దుల్ మలిక్ 61 కేజీల విభాగంలో బంగారు పతకం, షేక్ నిజాం 74 కిలోల విభాగంలో వెండి పతకం సాధించారు. వీరిని కార్వాన్, యాఖుత్‌పురా, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్‌మొహినుద్దీన్, జాఫర్‌హుస్సేన్ మెరాజ్, మాజీద్ హుస్సేన్ సోమవారం సన్మానించి అభినందించారు. – మెహిదీపట్నం

పెట్రోలింగ్ పెంచాలని ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు

అంబర్‌పేట, డిసెంబర్ 16 : అంబర్‌పేట డివిజన్ ఆజాద్‌నగర్, ప్రేంనగర్ ఏరియాలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని కోరుతూ ఆకాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.లింగారావు, ప్రధాన కార్యదర్శి వి.రఘు, ఉపాధ్యక్షుడు ధన్‌రెడ్డి, కమతం శ్రీనివాస్, జె. తిరుపతి గుప్తా, కె. సురేశ్‌చారి, అడ్వయిజర్ తుల్లూరి దాసయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీకాంత్ తదితరులు ఇన్‌స్పెక్టర్‌ను కలిసి స్థానికంగా ఉన్న మహంకాళి వైన్స్‌తో కూడా ఇబ్బందిగా ఉందని చెప్పారు. బయట నుంచి వచ్చిన వ్యక్తులు గంజాయి తాగడం, వచ్చిపోయే వారిని , మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం వంటివి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వైన్‌షాపుతో వర్కింగ్ ఉమెన్స్ భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, డిసెంబర్ 16 : ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నల్లకుంట డివిజన్‌లోని చారీలేన్‌లో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ వై. అమృతతో కలిసి సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. బస్తీలు, కాలనీల్లో రోడ్లు, మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, పార్కుల అభివృద్ధి చేపట్టామని తెలిపారు. ఇంకా చాలా చోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు కొత్తగా ప్రతిపాదనలు కూడా తయారు చేయడం జరిగిందన్నారు. అనంతరం బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. బస్తీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సీసీ కెమెరాలు పని చేయడం లేదని, వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సీసీ కెమెరాలను మరమ్మతులు చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రశాంతి, బీఆర్‌ఎస్ నాయకులు రమణానాయుడు, అనిల్‌కుమార్, బీజేపీ నాయకులు మధుయాదవ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్భాషలాడిన వ్యక్తికి జైలు

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 16 : ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను దుర్భాషలాడిన వ్యక్తికి న్యాయ స్థానం పది రోజుల జైలు శిక్షను విధి స్తూ తీర్పునిచ్చింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన ప్రకారం.. తారకరామ థియేటర్ ఎదురుగా సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్నసుల్తాన్‌బజార్‌కు చెందిన అర్జున్‌యాదవ్‌ను ఆపిన ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీనివాస్ డ్రంకన్ డ్రైవ్‌లో భాగంగా ఊదాలని అన్నాడు. కానీ అర్జున్ ఊదకుండా దుర్భాషలాడాడు. దీంతో అ తనిపై కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ మధుసూదన్ అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరుచగా న్యాయ మూర్తి పది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చిందని అన్నారు.

రైల్లో దొంగతనం

కాచిగూడ,డిసెంబర్ 16: హజ్రత్ నిజామోద్దీన్ రైల్లో ప్రయాణికుని ల్యాప్‌ట్యాప్, ఫోన్, ఏటీఎం, ఆధార్‌కార్డులు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన దీపక్ సంతోష్(45) ప్రైవేటు ఉద్యోగి. సెప్టెంబర్ 30వ తేదీన హజ్రత్ నిజామోద్దీన్–తిరుపతి రైల్లో వెళ్తుండగా కాచిగూడ రైల్వేస్టేషన్‌లో బ్యాగు చూసుకునేసరికి ల్యాప్‌ట్యాప్, ఆధార్‌కార్డులు, ఎస్‌బీఐ ఏటీఎం కార్డులు, ఫోన్‌ను దొంగిలించారు. అదేరోజు కర్నూల్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ రైల్వే సీఐ తెలిపారు.

వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్‌లో భారీ చేరికలు

యూనియన్‌లో చేరిన వారిని ఆహ్వానిస్తున్న అధ్యక్షుడు రాంబాబు యాదవ్

అబిడ్స్, డిసెంబర్ 16 : వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్‌లో భారీగా ఇతర యూనియన్ వారు చేరారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మయ్య వారి సమక్షంలో మూడవ డివిజన్ ఉద్యోగులు నాయకులు మహ్మద్ ఖలీల్ నాయకత్వంలో వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా రాంబాబుయాదవ్ వారికి పార్టీ కండువాలను వేసి ఆహ్వానించి, మిఠాయిలను తినిపించారు. అనంతరం రాంబాబు యాదవ్ మాట్లాడుతూ వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు జి. లక్ష్మీనారాయణ, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ జమీల్ అహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పి గోపాలకృష్ణ, బి జ్ఞానేశ్వర్, ఎ. ఉదయ్‌కుమార్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం. శివారెడ్డి, పి. కిషన్, మహ్మద్ అశ్వక్ అహ్మద్, కొమురయ్య, సెక్రటరీలు ప్రేమ్‌కుమార్, వినయ్, యాదగిరి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

మాల కులస్తుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 16 : మాల కులస్తుల సంక్షేమానికి మాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణలోని ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ మాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్ర భుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఆయన సంఘం సభ్యులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వర్గీకరణ వల్ల వచ్చే సమస్యలను కమిషన్ చైర్మన్‌కు వివరించినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అనేది రాజ్యాంగంలోని 341 ఆర్టికల్‌కు వ్యతిరేక మని చైర్మన్‌కు విన్నవించినట్లు ఆయన చెప్పారు. నాయకులు నాలుకల నర్సింగ్‌రావు, జంగ్లీ కిషన్, గంగం శివశంకర్, గేరేటి నాగరాజ్, కుమార్ల నవీన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఏకసభ్య కమీషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బేర బాలకిషన్

లంగర్‌హౌస్ చెరువు కట్టపై పునర్నిర్మించనున్న కట్టమైసమ్మ ఆలయం పనులలో భా గంగా సోమవారం అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. బస్తీ సంక్షేమ సంఘం నాయకులు ఆరెళ్ల కృష్ణాయాదవ్, ఉదయ్‌కుమార్, బుజిలి మహంకాళి ఆలయకమిటీ చైర్మన్ బోగి పరమేశ్‌కుమార్ తదితరులు పాల్గొని పూజలు చేశారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 16

ఆకట్టుకున్న కూచిపూడి రంగప్రవేశం

కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా.భాగవతుల సేతురాం శిష్యురాలు కుమారి మేఘన గార్లపాటి కూచిపూడి రంగ ప్రవేశం సోమవారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో నిర్వహించారు. మేఘన విఘ్నేశ్వర దరువు, శివకీర్తన, మహిషాసుర మర్దిని స్తోత్రం, తరంగం, భామాకలాపంలో రక్తికట్టించారు. వక్తలుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అభినయ తపస్వీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ ఆలేఖ్య పుంజాల, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమామహేశ్వరి, ప్రొఫెసర్ జి.చంద్రమోహన్ రెడ్డి తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కూచిపూడి రంగ ప్రవేశాన్ని ప్రారంభించి ఆశీర్వదించారు.

– రవీంద్రభారతి, డిసెంబర్ 16

గొల్లకురుమల ఐక్యతను దెబ్బతీస్తున్న యెగ్గె మల్లేశం

కాచిగూడ, డిసెంబర్ 16: తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం తన స్వార్థ రాజకీయాల కోసం గొల్లకురుమల ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ యాదవ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిర్రబోయిన బద్రీనాథ్‌యాదవ్ ఆరోపించారు. సోమవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కోకాపేటలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కురుమ సంఘం ప్రారంభోత్సవ కార్యక్రమంలో యెగ్గె మల్లేశం మాట్లాడుతూ.. గొర్లు, బర్లు, మేకలతో యాదవులకు సంబంధం లేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. యెగ్గె మల్లేశం మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష మందితో యాదవుల భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాపునగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట డివిజన్ బాపునగర్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సోమవారం పాదయాత్ర నిర్వహించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలు అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. – గోల్నాక, డిసెంబర్ 16

కాచిగూడలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కాచిగూడ,డిసెంబర్ 16: మందుబాబులపై కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బర్కత్‌పుర తెలంగాణ యువతి మండలి సమీపంలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వాహనదారులు తాగుడుకు బానిసై తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు.